




సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్. పక్కన అంజిబాబు, రాధాకృష్ణ

కంపెనీల మేలుకే..!

- సోలార్ కంపెనీలతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి
- కారు చౌకగా కొట్టేస్తున్న సోలార్ కంపెనీలు
- రైతులకు, కంపెనీలకు ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించాలి
- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆలూరు

రాయలసీమ జిల్లాలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం సోలార్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందం కంపెనీలకు మేలు చేసేందుకే అని, రైతులకు లబ్ధి చేకూర్చే ఆలోచన చేయలేదని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ జిల్లాలోని సోలార్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి, జొహరాపురం, మొలగవల్లి, ముద్దనగేరి, హోళగుందలో రైతుసంఘం రాష్ట్ర, జిల్లా బృందం పర్యటించింది. సోలార్ కంపెనీలు రైతుల నుంచి సేకరిస్తున్న భూముల కొనుగోలు, లీజు ఒప్పందాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కోస్తాంధ్ర ప్రాంతంలో భూముల విలువ ఎక్కువగా ఉంటాయని, రాయలసీమ కరువు ప్రాంతం, సాగుకు నోచని భూములు ఉన్నాయని.. రైతులు కంపెనీలకు సులభంగా ఇస్తారనే దురుద్దేశంతో ప్రభుత్వం సోలార్ కంపెనీలతో ఒప్పందం చేసుకుందని చెప్పారు. రైతులతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకుండా సోలార్ కంపెనీలు దళారులతో కారు చౌకగా భూములను కొట్టేస్తున్నారని మండిపడ్డారు. మొలగవల్లి గ్రామంలో రైతుల దగ్గర భూములను కొనేందుకు మాయమాటలు చెప్పి, మోసం చేసి ఎకరా రూ.5.25 లక్షలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో మరో కంపెనీ లీజు పద్ధతిలో ఏడాదికి రూ.30 వేలు కౌలు (లీజు) చెల్లిస్తూ మూడేళ్లకోసారి 4 శాతం అదనంగా చెల్లిస్తామని ఆశ చూపి దళారులతో ఒప్పించి రైతుకు తెలియకుండానే రైతుకు ఉరి వేస్తున్నారని విమర్శించారు. పంట పండించుకునే రైతుకు, రైతుకు మధ్య ప్రభుత్వం 11 నెలలు కౌలు ఒప్పందాన్ని పెట్టి సోలార్ కంపెనీకి రైతుకు 30 ఏళ్ల లీజు ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సోలార్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకొని సోలార్ కంపెనీలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. భూముల కొనుగోలులో పొలాలను బట్టి ఎకరాకు రూ.25 లక్షలు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. లీజు పద్ధతిలో నెలకు రూ.30 వేలు చెల్లించి మూడేళ్లకోసారి 25 శాతం అదనంగా చెల్లించి ప్రభుత్వమే మధ్యవర్తిత్వం వహించాలని కోరారు. మార్చి 5, 6 తేదీలలో ఆలూరులో భూములు కోల్పోతున్న రైతులను సమీకరించి, రైతులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు పి.హనుమంతు, సూరి, మండల కార్యదర్శులు ఈరన్న, ధనుంజయ పాల్గొన్నారు.



మొలగవల్లిలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు



ఆలూరు జ్యోతి బసు భవన్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

మతోన్మాద విధానాలపై పోరాటం

- సిఐటియు సమావేశంలో ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఏ.గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. మైనార్టీలపై దాడులు చేస్తూ రక్షణ లేకుండా చేస్తున్నారని అన్నారు. సమాజాన్ని ఐక్యంగా ఉంచే బాధ్యత కార్మిక వర్గానిదేనని అన్నారు. నరేంద్ర మోడీ లేబర్ కోడ్లను తీసుకొని వస్తూ కార్మికులకు రక్షణ లేకుండా చేస్తున్నాడని అన్నారు. లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు కట్టు బానిసలుగా మారాల్సిందేనని అన్నారు. 20 యేళ్లుగా కనీస వేతనాలు అమలు చేయడం లేదని, గతంలో జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదని, నేడు చంద్రబాబునాయుడు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కనీస వేతనాల జిఒ విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఒకపైసా కూడాఖర్చుకాదని కానీ పెట్టుబడిదారులకు లొంగిపోయి కనీస వేతనాలు అమలు జరగకుండా చూస్తున్నాడని విమర్శించారు.కార్మిక హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాటాల నిర్వహిస్తుందన్నారు. కార్మిక వర్గ పోరాటాలను మరింత ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి సిఐటియు కార్యకర్తల సమావేశం కర్నూలులో నిర్వహిస్తున్నామని వర్క్ షాపు జయప్రదానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంగన్వాడి, ఆశ మధ్యాహ్న భోజనం, స్కూల్‌స్కావెంజర్స్ రంగాలలో వస్తున్న ఉద్యమాలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు పి.ఈరన్న,సిహెచ్ సాయిబాబా, నాగేశ్వరరావు, ఎం గోపాల్, విజయ్, నారాయణస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' జీవితం స్ఫూర్తిదాయకం

- పలువురు వక్తలు - ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం గొప్ప స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఏ క్యాంపులోని ఆయన కాంస్య విగ్రహానికి ఎంపీలు బస్తి పాటీ నాగరాజు, బైరెడ్డి శబరి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వైసిపి కర్నూలు నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు కెవి.సుబ్బారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గొప్ప స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప విప్లవకారుడని అన్నారు. ఏ మాత్రం భయపడకుండా హక్కుల కోసం పోరాడి ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు.. సమాజం కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఇలాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డిఎంహెచ్ఒ శాంతి కళ, పర్యాటక శాఖఅధికారి విజయ, మెప్మా పిడి నాగ శివలీల, ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో : కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు . ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నైస్ కంప్యూటర్స్ సంస్థ నిర్వాహకులు రాయపాటి శ్రీనివాస్, బి-క్యాంప్ గ్రంధాలయాధికారి వెంకటేశ్వర్లు, కళాశాల లెక్చరర్స్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు. కళాశాల లెక్చరర్స్ వాణి ప్రసన్న, రామకృష్ణ, విజయశేఖర్, జబీన్ అక్తర్, సుజాత, పార్థసారథి పటేల్, సుజాత, శ్రీధర్, లావణ్య, శ్రావణి, జెసింత, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెసి



ఎండ మొదలైంది..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలయిపోయాయి. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 38 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

కౌలుకు భూధార్ నష్టదాయకం : పౌరుల గుర్తింపునకు ఆధార్ కార్డు తరహాలో రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ ప్రక్రియను తెరపైకి తెచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతూ భూయజమానులందరికీ భూధార్ కార్డులు అందించే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టింది. ఈ నెల 27వ తేదీలోపు 30 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. దీంతో రబీ సాగులో రైతుల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేసి వ్యవసాయ అధికారులంతా భూధార్ ప్రక్రియలో నిమగమయ్యారు. 11 అంకెలు గల విశిష్ట సంఖ్యతో భూధార్ కార్డులను భూములున్న యజమానులకు అందజేసే ప్రక్రియ సాగుతోంది. ఇక నుంచి భూధార్ ఆధారంగా రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు, వ్యవసాయ సంబంధిత సేవలు, యంత్రాల అందజేత, పంటల బీమా, పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందనున్నాయి. వ్యవసాయ సాగులో భూయజమానుల పాత్ర చాలా తక్కువగా ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తూ అందరికీ అన్నం పెడుతున్న పరిస్థితి ఉంది. వాస్తవ సాగుదారులకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎప్పటి నుంచో కౌలురైతులు పోరాటం చేస్తున్నారు. అందులో భాగంగానే 2011లో కౌలురైతుల చట్టం వచ్చింది. 2019లో ఆ చట్టాన్ని సవరిస్తూ భూయజమానుల అంగీకారంతోనే కౌలుకార్డులు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం చేసిన చట్టం కౌలురైతుల బతుకులపై తీవ్ర ప్రభావం చూపింది. తాము అధికారంలోకి వస్తే నూతన కౌలుచట్టం తెచ్చి కౌలు రైతులను ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక దానికి భిన్నంగా కేంద్రంతో కుమ్మక్కై భూయజమానులకు భూధార్ ప్రక్రియను వేగంగా సాగిస్తోంది.

ఎపిజిబి రక్షణ కోసం : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రమయ్యాయి. సిఐటియుతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాడు నిర్ణయించి ప్రధాన కార్యాలయాన్ని కడపలో పెట్టారని, ఇప్పుడు దాన్ని తరలించాలనుకోవడం దుర్మార్గమని నాయకులు తెలిపారు.

అవీ..ఇవీ..అన్నీ.. : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెడ్ బుక్ డే కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో లెనిన్ రచించిన రాజ్యం-విప్లవం పుస్తకాన్ని చదివారు. జిల్లా వ్యాప్తంగా మాతృబాషా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.



పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- డిఆర్ఒ వెంకటనారాయణమ్మ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

మార్చి ఒకటి నుండి 20 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఒ వెంకట నారాయణమ్మ సంబధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్ఐఒ కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై, చీఫ్ సూపరింటెండెంట్లతో డిఆర్ఒ, ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి, జిల్లా వృత్తి విద్య శాఖ అధికారి పరమేశ్వర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటినుంచి 20 వరకు 69 సెంటర్లలో 45,325 విద్యార్థులు, మొదటి సంవత్సరం 23,098, రెండవ సంవత్సరం 22227 విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ప్రతి ఎగ్జామినేషన్ హాలులో తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు.. పరీక్ష కేంద్రాల్లో సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏడు సెంటర్లలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారన్నారు. ఆయా సెంటర్లలో ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. సమావేశంలో పరీక్షల స్పెషల్ ఆఫీసర్ లాలప్ప, టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, డిఇసి సభ్యులు పద్మావతి, సురేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

సమాచార శాఖ డిడి జయమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టులో సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ సూచించారు. శనివారం కలెక్టరేట్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో ఈ శ్రామ్‌కార్డు నమోదుపై అవగాహన కార్యక్రమం నగర అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షత నిర్వహించారు. డిడి జయమ్మ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టల సంక్షేమం కోసం చాలా పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. వాటిని తెలుసుకుని ప్రతి వర్కింగ్ జర్నలిస్ట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వత్తి రీత్యా జర్నలిస్ట్లు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగిన ఇన్సూరెన్స్ పరిహారం సౌకర్యం పొందేలా ఉంటుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఈ శ్రామ్ కార్డు పేద ,మధ్య తరగతి వారు 16 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు కలిగి ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లించకుండా, పిఎఫ్,ఇఎస్ ఐ లేని ప్రతి ఒక్కరు అర్హులన్నారు. అర్హులైన విలేకరు లందరూ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. లేబర్ ఆఫీసర్‌రామ్‌ప్రసాద్, ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శిమద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, కెబి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు లోఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హుస్సేన్, జిల్లా కన్వీనర్ నాగేంద్ర నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల పాల్గొన్నారు.



'ఉపాధి'పనులను పర్యవేక్షించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం ఎన్ఇఆర్ఇజిఎస్ పనుల పర్యవేక్షణలో భాగంగా ప్యాలకుర్తి గ్రామం గూడూరు రోడ్డులో ఉపాధి కూలీలతో శుక్రవారం ఎంపిడిఒ ఎసి రాముడు మాట్లాడారు. పనుల గురించి కూలీలకు వివరించారు. పని ప్రదేశంలో సమయపాలన పాటించాలన్నారు. రోజుకు రూ. 300 కూలిపడే విధంగా పనిచేయాలన్నారు. ఎవరు కూడా వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనిని వినియోగించుకోవాలన్నారను.

సచివాలయం తనిఖీ :ప్యాలకుర్తి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ వెయ్యాలని, పెండింగ్ సర్వేలన్నీ పూర్తి చేయాలన్నారు. ప్రజలు వారి అవసరాల నిమిత్తం సచివాలయానికి వచ్చినప్పుడు ఎటారిని మంచిగా స్వీకరించి వారికి సేవలు చేసి పంపించాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని కూడా సందర్శించి ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలన్నారు.

హెల్త్ సెక్రెటరీలకు ఇతర పనులు అప్పజెప్పరాదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ హెల్త్ సెక్రటరీలకు ఇతరు పనులు అప్పజెప్పరాదని కోరుతూ ఎపి ఎన్‌జిఒఎస్ అసోసియేషన్ అధ్యక్షులు విసిహెచ్. వెంకటరెడ్డి కోరారు. శనివారం కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుకు వారు కలిశారు. సచివాలయంలో పనిచేస్తున్న మెడికల్ డిపార్టుమెంటు హెల్త్ సెక్రెటరీలకు మెడికల్‌కు సంబంధించిన డ్యూటీలే కాకుండా వేరే ఇతర డిపార్టుమెంట్ డ్యూటీలు కూడా చేయమని వీడియో కాన్ఫరెన్స్‌లో ఒత్తిడి చేస్తున్నారని తెలిసందన్నారు. ప్రభుత్వం స్పష్టంగా మెడికల్ వాళ్లకు ఇతర డ్యూటీలు వేయకూడదని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా కూడా, హెల్త్ సెక్రెటరీలకు ఇతర డ్యూటీలు చేయమని ఒత్తిడి చేయకూడదన్నారు. 42 ప్రభుత్వ యాప్లతో తీవ్రంగా పని ఒత్తిడి పెరుగుతున్నదన్నారు. ఈ విషయంపై కమిషనర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు చాలా వరకు పెండింగులో పెడుతున్నారన్నారు. ఈ విషయంపై కూడా చర్యలు తీసుకోమని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, కెసిహెచ్ కృష్ణుడు, కర్నూలు నగర అధ్యక్షులు ఎంసి కాశన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు చందన, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వరయ్య, ,కర్నూలు నగర సంయుక్త కార్యదర్శి మునీర్ అహ్మద్, జిల్లా ఇసి మెంబర్ మద్దయ్య, మహిళా హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్‌జిఒ నాయకులు వెంగళ్‌రెడ్డి, తదితరులు

జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యం

- -నగరంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలి
- -జగన్నాథ గట్టు జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాలు అభివృద్ధి చేయాలి
- -జర్నలిస్ట్ ల పిల్లలకు 100శాతం విద్యారాయితీ
- -యుజెఎఫ్ నూతన నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్


జర్నలిస్టుల అభివద్ధి సంక్షేమమే లక్ష్యంగా యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యూజెఎఫ్) పనిచేస్తుందని ఆ సంఘం నాయకులు అన్నారు. శనివారం యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) ఆధ్వర్యంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో నీలంసత్యనారాయణ, చిన్న రామాంజనేయులు అధ్యక్షతన జర్నలిస్టుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు నగర కమిటీ నూతన కార్యవర్గంను ప్రజాస్వామ్య పద్ధతిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శేషఫణి, కంది వరుణ్ కుమార్, లీగల్ అడ్వైజర్ గురుప్రసాద్, చిన్న రామాంజనేయులు మాట్లాడారు. సమాజంలో జర్నలిజం ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. అలాంటి జర్నలిస్ట్‌లు నేడు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. సంస్థల టార్గెట్లను పూర్తిచేయలేక ఇబ్బందులు పడుతురన్నారు. వార్తలు రాసే సమయంలో సైతం సంకెళ్లు వేసే విధంగా కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. మరోవైపు సరైన వేతనాలు లేకుండా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలను పాలకులు నీరు గారుస్తున్న దుస్థితి ఉందన్నారు. కర్నూలు నగరంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు, జగన్నాథ గట్టు జర్నలిస్ట్‌ల ఇళ్లస్థలాలు అభివృద్ధి, జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం విద్యారాయితీ వంటి సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. యుజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్‌లను చైతన్యం చేసి సమస్యలు పరిష్కారమయ్యేవరకు దీర్ఘకాల పోరాటాలు సాగిస్తామని చెప్పారు. యుజెఎఫ్ పోరాటాలకు జర్నలిస్ట్ లు కలిసి రావాలని కోరారు. నాయకులు సాగర్, విజయ్ కుమార్, పరమేష్, చంద్రమోహన్, యూసుఫ్ ఖాన్, మల్లికార్జున, విజయ్‌కుమార్, గంగాధర్, విజయ్‌కుమార్, వరప్రసాద్, పలువురు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కర్నూలు నగర నూతన కార్యవర్గం

కర్నూలు నగర అధ్యక్షులుగా పి.నాగేంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా జి.మునిస్వామి, కోశాధకారిగా యు.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా వి.ప్రసాద్, ఎన్‌కె.మధు, డి.సంజీవయ్య, సహాయ కార్యదర్శులుగా టి.జయబాబు, రవి గౌడ్, మధుసూదన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి.రవిబాబు, ఆర్.చంద్రశేఖర్, ఇ.రవిశంకర్ గౌడ్, పి.సుంకన్న, రాజు, పి.జయరాజు, ఎన్.వజ్రరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



జి. మునిస్వామి



పి.నాగేంద్రుడు



నూనత కార్యవర్గంతో యుజెఎఫ్ నాయకులు



మోడల్ స్కూలులో అసౌకర్యాలు

గాడి తప్పిన మధ్యాహ్న భోజనం పతకం-ఐసిడిఎస్ పిడి తనిఖీలో వెల్లడి

ప్రజాశక్తి- క్రిష్ణగిరి

క్రిష్ణగిరి ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సరయిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల ఆకస్మికంగా తనిఖీ చేయడంతో సమస్యలు వెలుగులోకి వచ్చాయి. మోడల్ స్కూలు ప్రిన్సిపల్ అందుబాటులో లేకపోగా ఆమె లీవ్‌లెటర్‌ను కూడా ఎవరికిచ్చారో తెలువదు. దీంతో పిడి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పిడి పరిశీలించారు. పాఠశాలలో స్వయంగా వారే విద్యార్థునులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులకు మధ్యాహ్నం పూట పెడుతున్న భోజనం సక్రమంగా నిర్వాహకులు వండి పెట్టాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న వంటగది, ఇతర గదులు, పరిసరాలను నిశితంగాపరిశీలించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సెలవులో ఉండడంతో సెలవు లెటర్ అడిగారు. సెలవు లెటర్ ఆఫీసు రూమ్‌లో పెట్టుకొని తాళం వేసుకొని పోవడంతో ప్రిన్సిపల్ నిర్మలకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థునులతో సమావేశమై సమస్యలను అడిగి తెసుకున్నారు. వారి సమస్యలను విని ఆమె నివ్వెరపోయారు. ఇటువంటి దుర్భత పరిస్థితిపై వివరణ అడగడానికి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఇక్కడ లేరన్నారు. వీటన్నిటిపై విచారణ జరిపిపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల తెలిపారు. ఈ తనఖీలో తహశీల్దార్ దేవ.చంద్రశేఖర్, ఎంపిడిఒ మోహన్ కుమార్, విఆర్ఒ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాటీ లివర్ బాధితులకు శుభవార్త

శ్రీచక్ర హాస్పిటల్‌లో రూ.7 వేల విలువైన ఫైబ్రోస్కాన్ టెస్ట్ కేవలం రూ. 400

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్న వారి కోసం చెన్నమ్మ సర్కిల్‌లోని శ్రీ చక్రహాస్పిటల్‌లో రూ.7000 విలువ గల ఫైబ్రోస్కాన్ పరీక్ష కేవలం రూ.400 రూ.లకే చేస్తున్నామని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రలాజీస్టు, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.సందీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ టేస్టును మధుమేహం (షుగర్)వ్యాధిగ్రస్తులు, మద్యపానం, ధూమపానం చేసేవారు, అధిక బరువు ఉన్నవారు లివర్ సమస్యలతో బాధపడేవారు, అధిక రక్తపోటుతో బాధపడేవారు ఫైబ్రో స్కాన్ పరీక్ష చేయించుకోవాలని అన్నారు. ఈ టెస్ట్ పరగడుపున చేస్తారని అన్నారు. మీ లివర్ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి ఇది ఒక అద్భుత అవకాశమని అన్నారు. శ్రీ చక్ర హాస్పిటల్స్‌లో ఈనెల 24న సోమవారం ఉదయం 9.00 నుండి 11.00 మధ్య చేస్తామన్నారు. ఉదయం పరగడుపున రావాలన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ 9392149562, 085182 77995.



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

- 774 పనులను రూ.11.64 కోట్లు ఖర్చు - రికవరీ రూ.75 వేలు, పెనాల్టీ రూ.40 వేలు

ప్రజాశక్తి - హోళగుంద

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అడిషనల్ పీడీ మాధవిలత హాజరయ్యారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా మండలంలోని పంచాయతీల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగిన పనులకు 17వ విడత సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. ఉపాధి తనిఖీ ప్రజావేదికకు అధికారులు, ఉపాధి సిబ్బంది తప్ప జనం రాలేదు. అధికారులు తూతూమంత్రంగా తనిఖీని ముగించారు. ఈఏడాది ఉపాధి హామీ కింద 774 పనులు గుర్తించారు. అందులో ఉపాధి కింద 774 పనులు, పిఆర్ఐ కింద 22 పనులు, ఆర్‌డబ్ల్యుఎస్ కింద 3 పనులు గుర్తించారు. ఇందుకు సంబంధించి కూలీల చెల్లింపులు రూ.9,99,950. అలాగే మెటీరియల్ కింద రూ.1,65,89,530 విడుదలయ్యాయి. కూలీలు, మెటీరియల్ మొత్తం కలిపి రూ.11,64,70,750 విలువైన పనులు చేపట్టారు. రూ.75,971 విలువైన పనుల్లో అవినీతి జరిగిందని, ఆ మొత్తం రికవరీ చేయాలని అధికారులకు సూచించారు. 23 గ్రామాల్లో తనిఖీ చేసి పెనాల్టీ కింద రూ.40 వేలు వేశారు. వీటిని ఉపాధి అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ప్రజావేదిక కార్యక్రమంలో కేవలం అధికారులు, ఉపాధి సిబ్బంది తప్ప జనం లేక పోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పించారు. డిఇఒ లోకేశ్వర్, ఏపీడీ పద్మావతమ్మ, ఎంపిడిఒ విజయలలిత, ఎపిఒ భక్తవత్సలం పాల్గొన్నారు.

చదువుకు అంగన్వాడీ కేంద్రాలు పునాది

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, ఉపాధ్యాయులు నాగమణి, జానకి

ప్రజాశక్తి - చిప్పగిరి



చిత్రలేఖనం బొమ్మల ఫొటోలతో అంగన్వాడీలు

అంగన్వాడీ కేంద్రాలు చిన్నపిల్లల చదువుకు పునాదులని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జానకి, నాగమణి తెలిపారు. శనివారం చిప్పగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు వివిధ రకాల చాప్టర్లను వేసి అందులో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీశారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడారు. జిల్లా పీడీ, ఆలూరు సిడిపిఒ శశికళ ఆదేశాల మేరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 120 రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా పలు అభివృద్ధి అంశాలను 4వ రోజు శిక్షణ తరగతుల్లో తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఆరు రోజులపాటు తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముున్ముందు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను ప్రీస్కూల్‌లో కలిపే ప్రయత్నంలో అన్నీ యాక్టివిటీస్ తెలియజేస్తున్నట్లు చెప్పారు. కథలు, పాటల ద్వారా తెలియజేసి పిల్లల అభివృద్ధి, చిన్నతనం నుంచి మంచి విద్యాబోధన పిల్లలకు నేర్పే విధంగా టీచర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీఫ్, ఉపాధ్యాయురాలు భారతి పాల్గొన్నారు.

సారా తయారీకి బెల్లం విక్రయిస్తే కేసులే

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

సారా తయారీకి బెల్లం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. నాటుసారా రహిత ప్రాంతంగా ఆదోనిని మారుద్దామని కోరారు. శనివారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. 5 కిలోల కన్నా బెల్లం ఎక్కువగా విక్రయించరాదన్నారు. అప్పటికీ సంబంధిత వ్యక్తి ఆధార్ కార్డు తీసుకొని బెల్లం విక్రయించాలని తెలిపారు. నాటు సారా తయారీలో బెల్లం వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత వ్యాపారిపై కేసు నమోదు చేస్తామన్నారు. నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు నవోదయం కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందని, తెలిపారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి ప్రజల భాగస్వామ్యంతో సమూలంగా నాటుసారాను అరికడతామని చెప్పారు. పట్టణంలోని బోయగేరి ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.


బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న సిఐ

కాంట్రాక్టర్లు ఎందుకు రావడం లేదు..?

- కౌన్సిలర్ల అసహనం

ప్రజాశక్తి - ఆదోని


నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ఆదోని మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందని, పనులు చేయించాల్సిన అధికారులు ఎందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్ హసీనా బేగం మాట్లాడుతూ... రోడ్డు నిర్మించాలని 6 నెలలుగా అడుగుతున్నా ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు మాట్లాడుతూ... అభివృద్ధి పనుల కోసం అజెండాలో ఆమోదం తెలిపి నెలలు గడుస్తున్నా ఎందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అందులో ఆంతర్యం ఏమిటి అని మున్సిపల్ కమిషనర్ కృష్ణను నిలదీశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు గాడి తప్పారని, ఎవరి మాట విని పనులు ప్రారంభించడం లేదో తెలపాలని పట్టుబట్టారు. వార్డుల్లో సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ, ఇతర అభివృద్ధి పనులు చేయాలని కౌన్సిలర్లంతా మూకుమ్మడిగా ఆమోదం తెలిపినా పనులు మొదలు పట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిధుల్లేవని తప్పించుకోవడం సరికాదని, ఎవరి ప్రోద్బలంతోనో అభివృద్ధిని అడ్డుకోవడం అధికారులకు సరికాదని తెలిపారు. పనులు మొదలు పెట్టాలంటే పర్సెంటేజీలు అడుగుతున్నారని కొంతమంది కాంట్రాక్టర్లు అంటున్నారని, ఎమ్మెల్యేనా లేక ఛైర్మనా అన్నది అధికారులు నిగ్గు తేల్చాలని చెప్పారు. కౌన్సిలర్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ... రంజాన్ మాసం మొదలవుతుందని, మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. వైస్ ఛైర్మన్ గౌస్ మాట్లాడుతూ... కుక్కల బెడద రోజురోజుకు తీవ్రంగా మారుతోందని, కట్టడి చేయాలని తెలిపారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... కుక్కలు పట్టే కార్యక్రమం చేపట్టేందుకు నిధులు లేవని తెలిపారు. కౌన్సిలర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ... పైపులైన్ లీక్ అవుతోందని కోరుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... వీరభద్ర స్వామి గుడి వద్ద రోడ్డు వేయాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

కౌన్సిల్‌లో గందరగోళం : ఎమ్మెల్యే పంచన చేరిన లలితమ్మ మాట్లాడుతూ... అమరావతి నగర్‌లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని వైసిపి కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని లేవనెత్తారు. అధికారం తమదేనని వైసిపి కౌన్సిలర్లు విర్రవీగుతున్నారని, ఎవడబ్బా సొమ్ము కాదంటూ పేర్కొనడంతో సభలో గందరగోళం నెలకొంది. ఆమె వ్యాఖ్యలను నిరసిస్తూ వైస్ ఛైర్మన్ నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథ రెడ్డి, బాలాజీ, చలపతి, లోకేశ్వరి, ఫయాజ్, అశోక్‌లు ఛైర్మన్ పోడియం చుట్టుపెట్టారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కౌన్సిలర్ లలితమ్మను సస్పెండ్ చేయాలని, లేకపోతే కౌన్సిలర్లకు క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో అరగంట పాటు వాదోపవాదాలు జరిగాయి. చివరకు లలితమ్మ క్షమాపణ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, ఆర్ఒ నసీర్ హుస్సేన్, డిఇలు రామ్మూర్తి, గోపీనాథ్, చలపతి రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ ఉన్నారు.


కమిషనర్‌ను నిలదీస్తున్న వైస్ ఛైర్మన్ నరసింహులు

ఈ-శ్రమ్ కార్డును తీసుకోవాలి

- ఎంపిడిఒ పుల్లయ్య

ప్రజాశక్తి - నందవరం

ఉపాధి కూలీలు ఈ-శ్రమ్ కార్డును తీసుకోవాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. శనివారం ఆయన మాచాపురం గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మస్టర్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలు తప్పకుండా ఈ-శ్రమ్ కార్డును తీసుకోవాలని తెలిపారు. ఈ కార్డు ప్రయోజనాల గురించి వివరించారు. ఎవరూ వలస వెళ్లొద్దని, ప్రతి ఒక్కరూ వందరోజుల పనిని పూర్తి చేసుకోవాలని తెలిపారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబం నైపుణ్య శిక్షణకు అర్హులవుతారని చెప్పారు. ఎపిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ఎంపిపి జూటూరు హేమలత
- సర్వసభ్య సమావేశంలో సమస్యలను ప్రస్తావించిన సర్పంచులు, ఎంపిటిసిలు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజాప్రతినిధులందరూ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిపి జూటూరు హేమలత అధికారులను కోరారు. శనివారం మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ అల్లా బకాష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి పనులను వివిధ శాఖల అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ... సొంత పొలం కలిగిన ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరిగా పొందాలన్నారు. ఆధార్ కార్డు ఎలా ఉందో ప్రతి రైతుకూ ఈ విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ ఐడి నెంబర్ ఉంటేనే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తీసుకోవడానికి అర్హత ఉంటుందన్నారు. ఉపాధి వేతనాలు, గోకులం షెడ్ల బిల్లులు రావడం లేదని సర్పంచులు గోవిందరాజులు, కరివేముల సావిత్రి, మల్లమ్మ, రోహిణి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపిపి, ఎంపిడిఒ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-శ్రమ్ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎవరైనా ఈ-శ్రమ్ కార్డు తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ-శ్రమ్ కార్డు పొందితే అనేక ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ వేసవికాలం మూడు నెలలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారీ తాగునీటి సమస్య ఏర్పడకుండా చూసుకోవాలని సూచించారు. సమస్య ఏర్పడినా సకాలంలో పరిష్కరించేలా ఉండాలన్నారు. ఎంపిటిసిలు సుమలత, రజిని, సుంకన్న, భీమలింగ, సరోజమ్మ, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎంఇఒ సావిత్రి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటేశ్వర్ రెడ్డి, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఎం నాగార్జున, ఎపిఒ జుబేర్ అహ్మద్, సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సర్పంచులు

కైరవాడిలో ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

- సందర్శించిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో హజరత్ అలీ సాహెబ్ స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం గంధంతో ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం ఉరుసు, సోమవారం కిస్తీతో ముగియనున్నట్లు దర్గా ముజావర్లు, గ్రామ పెద్దలు తెలిపారు. గంధం ఉత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి దర్గాను సందర్శించి ముజావర్లతో కలిసి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ధర్మకర్త వారం లక్ష్మణరావు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. టిడిపి నాయకులు తిమ్మారెడ్డి, నజీర్ సాహెబ్, రాజేష్, పెద్దయ్య, రామ నరసన్న గౌడ్, దర్గా ముజావర్లు రషీద్, సుభాన్, అలీపీర్, దర్గా కమిటీ సభ్యులు డీలర్ బాష, చదువుల గోకారి పాల్గొన్నారు.


దర్గాను సందర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ

యువత వ్యాపార రంగంలో రాణించాలి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యువత వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం పట్టణ సమీపంలోని టిడిపి కార్యాలయం పక్కన నూతన ఇరాని డూడ్ కేఫ్‌ను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు.


ఇరాని కేఫ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ



పట్టుదల ఉంటేనే ఏదైనా సాధ్యం

- ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

పట్టుదల ఉంటే ఏ పనిలోనైనా విజయం సాధించవచ్చని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న తెలిపారు. నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కె.వినయ్, ఎం.ధనుష్‌లు నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌సిప్‌కు ఎంపికయ్యారు. శనివారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంపిక కావడానికి సైన్స్ టీచర్ చిన్న రెడ్డయ్య కృషి ఎంతో ఉందని తెలిపారు. ఆ నిరుపేద విద్యార్థులకు నాలుగేళ్ల వరకు ఏడాదికి ఒకసారి స్కాలర్‌షిప్ రూ.12 వేలు అందుతుందన్నారు. ప్రతి విద్యార్థీ ఎందుకు ఎంపిక కాకూడదని ఆలోచించి కష్టపడి చదివి విజయాలు సాధించాలని సూచించారు.

బాలునికి డెంగీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో ఐదేళ్ల బాలునికి డెంగీ జ్వరం సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శనివారం గ్రామంలోని బాలుడు ఇంటి పరిసరాలను సబ్ యూనిట్ అధికారితో పాటు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు పరమేశప్ప, భారతి పాల్గొన్నారు.

లాడ్జీల్లో రిజిస్టర్ల చోరీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని లాడ్జీల్లో ఉన్న రిజిస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు లాడ్జీ లీజు నిర్వాహకులు అనిల్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సిఐ రామాంజులును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. కొన్ని రోజులుగా ఆగంతకులు సుమారు పది లాడ్జీల్లో ఉన్న రిజిస్టర్లను అపహరించిన సిసి పుటేజీలను సిఐ రామాంజులుకు చూపించారు. రిజిస్టర్లలో భక్తుల పేర్లు, సెల్ ఫోన్ నెంబర్లు ఉన్నందున భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్త వహించాలని సిఐ రామాంజులు సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శిల్పా కాలనీ, పార్కు రోడ్డు ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఆదోని అభివృద్ధిలో జనసేన కీలకం

- అభాండాలు మానుకోవాలి
- జనసేన ఇన్‌ఛార్జ్ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిని ప్రగతి పథంలో నడిపించే దిశగా జనసేన కీలకంగా వ్యవహరిస్తోందని, అందరూ భాగస్వామ్యం కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మల్లప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జనసేన మండల నాయకులు పులి రాజు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. వైసిపి పాలనలో జనసేన ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఎదురొడ్డి నిలిచిందని తెలిపారు. పోలీసు కేసులు, భౌతిక దాడులు జరిగాయన్నారు. నియోజకవర్గంలో అప్పటి వైసిపి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఆయన అనుచరులు చేస్తున్న ఆగడాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిపక్ష పాత్ర పోషించి ఇంటికి సాగనంపిన ఘనత తమదేనని తెలిపారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు తమ నైజం కాదని, తనపై వస్తున్న అభాండాలన్నీ పుకార్లే అంటూ కొట్టిపారేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ డబ్బు సంపాదన లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. కూటమి ఎమ్మెల్యే గెలుపులో జనసేన కీలకంగా వ్యవహరించిందని తెలిపారు. అధికారంలోకి వచ్చినా కొన్ని సమస్యలు ఉన్నాయని, అవి సామరస్యంగా పరిష్కారమయ్యేలా శ్రద్ధ చూపుతామని చెప్పారు. బిజెపి, జనసేన, టిడిపి నాయకుల మధ్య సమన్వయం లేదని ఇటీవల తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ఘటన నిదర్శనంగా నిలిచిందని తెలిపారు. అక్కడక్కడ కొన్ని పొరపాట్లు జరిగాయని తెలుస్తోందని, వాటిని సరి చేసుకొని జనసేన నాయకులు, కార్యకర్తలకు కూడా న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. తండ్రి పేరు చెప్పి రాజకీయాలు చేసే కాలం ఇక ఉండదని, ప్రజల్లో మమేకమై పని చేసే వారే నాయకులు అవుతారని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద రూ.4,700 కోట్లతో రోడ్లు వేయించిన ఘనత పవన్ కల్యాణ్‌కు దక్కిందన్నారు. పట్టణ అధ్యక్షులు రేణు వర్మ, మండల అధ్యక్షులు తాహెర్ వలీ, నాయకులు రాజశేఖర్, చంద్రశేఖర్, మారుతి, శ్రీనివాసులు, ప్రకాష్, ఉరుకుందు, ఎల్లప్ప, సాయి, శ్యామ్, రాజశేఖర్, రాజేశ్వరి, క్రాంతి నగర్ వెంకీ, అశోక్, నవీన్, సిద్ధ, రాకేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న మల్లప్ప

ఎంఎస్ రెసిడెన్సి ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన ఎంఎస్ రెసిడెన్సిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రారంభించారు. ఎంఎస్ రెసిడెన్సి యజమాని డాక్టర్ ఎమ్‌డి.అయూబ్ ఆహ్వానం మేరకు మంత్రాలయం వచ్చిన ఆయన ఎంఎస్ రెసిడెన్సిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయనకు, వెంట వచ్చిన వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డికి, దశరథ రెడ్డికి, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామికి, ఎంపిటిసి వెంకటేష్‌కు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ప్రముఖులు డాక్టర్ అయూబ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నాయకులు సెంట్రింగ్ రాము ఉన్నారు.

విలేకరులకు తోడుగా ఉంటాం : నియోజకవర్గంలోని విలేకరులకు తోడుగా ఉంటామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజాశక్తి సీనియర్ విలేకరి వడ్డే మాధవ్ భార్య ఇందిర ఇటీవల మేజర్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటికి క్షేమంగా రావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, యువ నాయకులు దశరథ రెడ్డి, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి మాధవ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇందిర ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఎప్పుడే సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వడ్డే నారాయణ వారి సోదరులు, కుమారులతో కొద్ది సేపు చర్చించారు.

పరీక్షలంటే భయం వీడాలి

- సంకల్పం ఉండాలి..!
- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వక్తలు

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి, మంచి మార్కులు సాధిస్తామనే సంకల్పం ఉండాలని ఎంపిడిఒ సుబ్బరాజు, సర్పంచి పాల్ దినకరన్, నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి, వివిధ పాఠశాల కరస్పాండెంట్లు నాగేంద్ర, కృష్ణమూర్తి తెలిపారు. శనివారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు కీలకమన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టం వృథా కాకుండా మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రుల పేరును, చదువులు చెప్పిన ఉపాధ్యాయులు, క్రమశిక్షణతో విద్యను అందించిన పేరును నిలబెట్టాలన్నారు. విద్యార్థుల మధ్య మంచి స్నేహం ఉంటే భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థి దశలో 25 ఏళ్లు కష్టపడితే 75 ఏళ్లు సుఖ సంతోషాలతో, పేరు ప్రఖ్యాతలతో జీవించవచ్చని తెలిపారు. విద్యార్థి దశలో కష్టపడకుండా జల్సాలకు అలవాటు పడితే 75 ఏళ్లు కష్టాలు తప్పవన్నారు. ఇది ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. గతంలో చదువుకోవాలంటే సరైన సౌకర్యాలు ఉండేవి కాదని, ప్రస్తుతం ప్రభుత్వాలు, విద్యాసంస్థలు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలతో, క్రమశిక్షణతో విద్యను అందిస్తున్నాయని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్, సలహాదారుడు లక్ష్మణాచారి, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి, సత్యన్న, రాజానందు, అహ్మద్ పీర్ పాల్గొన్నారు.



హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

- యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సివిల్ సప్లయి హమాలీల కూలి రేట్లకు సంబంధించిన పెంచిన కొత్త జిఒను విడుదల చేసి అమలు చేయాలని ఎపి సివిల్ సప్లయి హమాలీ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆదోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేపట్టారు. సివిల్ సప్లయి హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.నారాయణ, బి.మల్లికార్జున మాట్లాడారు. సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫం చెందుతోందని విమర్శించారు. ఇటీవల కాలంలో పెంచిన కూలి రేట్లు రూ.25 నుంచి రూ.28కి సంబంధించిన జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయి హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. బోనస్, స్వీట్స్, కుట్టుకూలితో పాటు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు బి.వీరాంజనేయులు, బాబన్న, రామాంజిని, వీరేష్, ప్రకాష్, నరసింహులు, కె.వీరేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య కోరారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం పంచాయతీ పరిధిలో ఇఒ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన చెత్త సేకరణ అవగాహన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ హాజరై పలు కాలనీల్లో పర్యటించారు. తమ గ్రామంలో చెత్త సేకరణ కేంద్రం ఉందని, పంచాయతీ తరపున రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారని కాలనీ వాసులు వివరించారు. ఇఒఆర్‌డి ప్రభావతి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసిలు వెంకటేష్ శెట్టి, వెంకటేష్ పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్'కు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - గోనెగండ్ల



నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌కు గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడారు. గత డిసెంబర్ 8న నిర్వహించిన ఈ పరీక్షలో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రెహాన్, స్నేహలతలు ప్రతిభతో స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఈ ఉపకార వేతనాన్ని విద్యార్థులు అందుకోనున్నట్లు చెప్పారు. అత్యుత్తమ ప్రతిభతో ఎంపికైన ఇద్దరు విద్యార్థులతో పాటు వారికి సహకరించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ అభినందించారు.

వైభవంగా వన్నూరు స్వామి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ


అశ్వంపై స్వామి వారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

మండలంలోని కరివేముల గ్రామంలో శ్రీవన్నూరు స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం దర్గా కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా సాగాయి. ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి అశ్వాన్ని గ్రామంలోని ప్రధాన వీధులు, రహదారుల గుండా ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారి దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆళ్లగడ్డ నందు

I.A.: 514/ 2022 in O.S: 54 / 2015

పి.నాగ లక్ష్మి & 2 ఇతరులు
.... Petitioners/ Plaintiff.
V/s
1. పి వెంకట సుబ్బ రెడ్డి
2. పి రామ సుబ్బయ్య
.... Respondent/ Defendant

2వ రెస్పాండెంట్ కు నోటీసు

R2
పి రామ సుబ్బయ్య, S/o వెంకట సుబ్బ రెడ్డి,
H.No: 86/277, సోమప్ప కాలనీ, జోహాపురం,
కర్నూలు సిటి & జిల్లా.

పై నంబరు పిటిషన్ లో పిటిషనర్లు, గౌరవ కోర్టు వారు గతములో 10-10-2018 తేదీన పాస్ చేసిన డిస్మిస్ ఆర్డరును కొట్టివేసి (set aside), దావాను పునరుద్ధరవలసినదిగా కోరుచూ పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు, కోర్టు నుంచి మీకు పలుమార్లు నోటీసులు పంపినను చేరనందున, ఈ ప్రకటన ద్వారా నీయొక్క హాజరు నిమిత్తము 11-03-2025 తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగినది.

కావున పైన తెలిపిన తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, నీ తరుపున వకీలు కానీ హాజరు అయ్యి, నీ ఆక్షేపనలు కోర్టు నందు తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

వాయిదా తేదీ : 11-03-2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
పిటిషనర్ అడ్వొకేటు, ఆళ్లగడ్డ
Cell : 9399993323

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆళ్లగడ్డ నందు

I.A.: 515/ 2022 in O.S: 54 / 2015

పి.నాగ లక్ష్మి & 2 ఇతరులు
.... Petitioners/ Plaintiff.
V/s
1. పి వెంకట సుబ్బ రెడ్డి
2. పి రామ సుబ్బయ్య
.... Respondent/ Defendant

2వ రెస్పాండెంట్ కు నోటీసు

R2
పి రామ సుబ్బయ్య, S/o వెంకట సుబ్బ రెడ్డి,
H.No: 86/277, సోమప్ప కాలనీ, జోహాపురం,
కర్నూలు సిటి & జిల్లా.

పై నంబరు పిటిషన్ లో పిటిషనర్లు, గౌరవ కోర్టు వారు గతములో 10-10-2018 తేదీన పాస్ చేసిన డిస్మిస్ ఆర్డరును కొట్టివేసి (set aside), దావాను పునరుద్ధరవలసినదిగా కోరుచూ వేసిన పిటిషన్ 1273 రోజుల ఆలస్యం అయ్యినందున, మన్నింపు కొరకు పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు, కోర్టు నుంచి మీకు పలుమార్లు నోటీసులు పంపినను చేరనందున, ఈ ప్రకటన ద్వారా నీయొక్క హాజరు నిమిత్తము 11-03-2025 తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగినది.

కావున పైన తెలిపిన తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, నీ తరుపున వకీలు కానీ హాజరు అయ్యి, నీ ఆక్షేపనలు కోర్టు నందు తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

వాయిదా తేదీ : 11-03-2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
వాది తరపు అడ్వొకేటు, ఆళ్లగడ్డ
Cell : 9399993323